క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమం



ప్రవచనాలను వినిపిస్తున్న దీవీ హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): మండలంలోని బిల్లలాపురం గ్రామ శివాలయంలో మూడు రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించి, భగవద్గీత, శ్రీమద్రామాయణం, మహాభారతంలోని ధార్మిక ప్రవచనాలను భక్తులకు వివరించారు. అనంతరం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, తిరుమలేష్, డాక్టర్ అపర్ణ, కృష్ణమ్మ, నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఆళ్లగడ్డ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రంగయ్య అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కురుస్తున్న వర్షాలకు కొత్త నీరు వచ్చి నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడైనా పైపులు లీకవుతుంటే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

ఖైదీల్లో మార్పు రావాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల జీవితాల్లో మార్పు రావాలని మూడవ అదనపు జిల్లా జడ్జి మండల లీగల్ సెల్ చైర్మన్ పి.వాసు పేర్కొన్నారు. శనివారం నంద్యాల సబ్‌జైలును అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, పరిశుభ్రత, వంట గదులు, ఖైదీల గదులను పరిశీలించి జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, లీగల్‌సెల్ సిబ్బంది శేఖర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నంద్యాలశ్రీ(న్యూటౌన్): రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. శనివారం హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సామాజిక భద్రత సీపీఎస్ రద్దు అయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాధవస్వామి, నగరి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. శ్రీనివాసులు, ఉమర్, జనార్దన్‌రెడ్డి, సుంకన్న, శ్రీదేవి, మునిస్వామి, బేబిరాణి, ధనలక్ష్మితో పాటు 18మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

జోరు వర్షం...రైతుల హర్షం



దొర్నిపాడు సమీప పొలాల్లో నిలిచిన వర్షపు నీరు,



ఉయ్యాలవాడ చేపల చెరువు కట్ట తెగి ప్రవహిస్తున్న వర్షపు నీరు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- ఉయ్యాలవాడలో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం
- 117.4 ఎం.ఎం.నమోదు

ఆళ్లగడ్డ: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. దుక్కులు దున్నుకున్న రైతులు పొలాలు పదును కావడంతో విత్తనాలు, మిరప నార నాటుకుంటున్నారు. కాగా మరో 48 గంటలు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

ఉయ్యాలవాడ : నైరుతి రుతుపవనాల రాకకు ముందే శుక్రవారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా ఉయ్యాలవాడలో 117.4 ఎం.ఎ., వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పాటు బీడు భూముల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఆశించిన స్థాయిలో వర్షం కురవడంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా ఎండ



ఉయ్యాలవాడ సమీప పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

తీవ్రత, వడగాల్పులతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఒక్కసారిగా భారీ వర్షం కురియడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది.

నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (ఎం.ఎం.)
ఆళ్లగడ్డ	49.0
చాగలమర్రి	0.8
దొర్నిపాడు	13.2
రుద్రవరం	4.2
శిరివెళ్ల	24.2
ఉయ్యాలవాడ	117.4



ఉయ్యాలవాడలో కురుస్తున్న వర్షం

ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న తరుణంలో చేతి బోర్లలో ఊట నీరు పెరుగనుంది. వంకలు, కుంటల్లో వర్షపు నీరు చేరడంతో గొర్రెల కాపరులు, పశువులకు తాగునీటి సమస్య తీరింది.

నీటి సరఫరాలో అంతరాయం

నంద్యాల(సిటీ): పట్టణంలో రెండు రోజుల పాటు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్కే ఎస్బీఐ ఏటీఎం జంక్షన్ వద్ద అమృత్ పథకం కింద పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నందున ఈ నెల 21, 22వ తేదీల్లో ఎన్జీఓ కాలనీ, విశ్వనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, లలిత నగర్, నూనెపల్లి, కంసాలి వీధి, మంచినీళ్ల బావి, ఎస్‌బీఐ కాలనీ, నంద్యాల గార్డెన్స్, సరస్వతి నగర్, గోపాల్ నగర్, గిరినాథ్ సెంటర్, సాయి బాబా నగర్, దేవనగర్, వీసీ కాలనీ, హనీఫ్ నగర్, శ్యాం నగర్, గ్రీన్ సిటీ, ఆర్‌ఎస్ రోడ్డు, బొగ్గులైన్, గట్టాల నగర్, గాంధీ నగర్, ఇస్లాంపేట, బలిజపేట, గొల్లపేట, బొమ్మలసత్రం, విజయనగర కాలనీ, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంతం, నూనెపల్లి, సాదిక్ నగర్, నివర్తిపురం, ఏకలవ్య నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, విజయభాను కాటన్ మిల్ ఏరియా, శంకరయ్య వీధి, దర్గా సందు, కొలిమి పేట, భూమా నగర్, బెన్నీ కాంప్లెక్స్ ఏరియా, వినాయక నగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు





శిరివెళ్లలో పూజలు చేస్తున్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

శిరివెళ్ల: స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం శ్రీ వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారి కేశవశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, పాలాభిషేకం, పంచామృత అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార ఈశ్వరయ్య శ్రేష్ఠి, కార్యదర్శులు రామకృష్ణ, నాగేళ్ల నాగేళ్లరాజు పాల్గొన్నారు.

నంద్యాలలో..

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శనివారం శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి మహోత్సవ వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలతో అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ స్థానిక చెరువుకట్ట వద్ద నుంచి గంగా జలాన్ని తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. అనంతరం నగరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించి, అమ్మవారికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్య వైశ్య సంఘం, వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో భవనాశి శ్రీనివాస్, వైశ్య పతాకావిష్కరణ గావించారు. సాయంత్రం దీపోత్సవంతో శ్రీవాసవీ కాన్యకాపరమేశ్వరిదేవి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. చివరగా పేద ఆర్యవైశ్యులకు గ్రైండర్లను పంపిణీ చేశారు. ఇందుమతి, శోభారాణి, బైసాని రామశేషు, రాంప్రసాద్, గురునాథం, నారాయణ, నాగమహేష్ పాల్గొన్నారు.

చాగలమర్రిలో వేడుకగా..

చాగలమర్రి: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జయంతిని శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీ వాసవీమాత పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, నవగ్రహ లఘు జపం తదితర కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమానికి శాశ్విత ఉభయ దారులు సత్యనారాయణ, పద్మావతి, చంద్రవర్ధన్‌కిషోర్ ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం శ్రీవాసవి మాల భక్త బృందం సహకారంతో శ్రీఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయాన్ని కల్పించారు. సాయంత్రం లక్షకుంకుమార్చన, రాత్రి అమ్మవారి ఉత్సమూర్తిని రథంపై అధిష్టింపజేసి రథోత్సవం జరిపించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు, ఉపాధ్యక్షులు బచ్చు వెంకటసుబ్రహ్మణ్యం, సెక్రటరి మదల్లపల్లె లక్ష్మీనారాయణ, ధర్మకర్త క్రిష్ణం శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ బచ్చు శ్రీనివాసులు, కోశాధికారి నవత ప్రసాద్, మేంబర్లు తొమ్మండ్రు నాగేంద్ర, బచ్చుబాబు పాల్గొన్నారు.



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- 21న స్వామి కల్యాణోత్సవం
- 23న రథోత్సవం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవ రెడ్డి, ఈఓ మద్దిలేటి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు సోమవారం గణపతిపూజ, స్వస్తివాచనం, మృత్సంగ్రహణం, పంచపాలకారాధన, ధ్వజారోహణం, పటాధివాసం, భేరి మృదంగనాథం తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 21వ తేదీ తెల్లవారుజామున 5.20 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, శేష వాహనం, సాయంత్రం హనుమంత వాహన సేవ నిర్వహిస్తామని చెప్పారు. 22వ తేదీ సాయంత్రం ప్రభోత్సవం, గరుడోత్సవం జరగనుందని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ బృందంతో చెక్కన భజనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 23వ తేదీ పూజాదీక్షాహోమం, బలిహరణం పూజ, రథాంగహోమం, సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం.. 24వ తేదీ ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం చూర్ణస్నపనం, పూర్ణాహుతి, సాయంత్రం పార్వేటతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.



ముస్తాబైన చెన్నకేశవస్వామి ఆలయం

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం





మహానందీశ్వరుడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు , కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శనివారం కల్యాణోత్సవం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో జరిగిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానందిలో వీకెండ్ సందడి

వరుస సెలవులు, వీకెండ్ కావడంతో మహానంది ఆలయం భక్తులతో సందడిగా మారింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. వినాయకనంది, గరుడనంది , నందిసర్కిల్, పెద్ద నందిని సందర్శించారు.



కుందూ నదిలో చేపల వేటలో జాలరులు



ఈత కొడుతూ చిన్నారుల సందడి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుందూనదిలో నీరు ప్రవహిస్తోంది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సమీపంలో నదిలో జాలరులు చేపల వేటలో నిమగ్నమయ్యారు. ఇక చిన్నారులు నదిలో సరదగా ఈత కొడుతూ సందడి చేస్తున్నారు. నిన్నటి వరకు నదిలో నీరు లేక బోసిపోయిన నదీప్రాంతం మళ్లీ జలకళను సంతరించుకుంది. ఇక రెండు నెలలుగా నీటి ఇక్కట్లతో ఇబ్బందులు పడిన ప్రజలకు నీటి సమస్య తీరనుంది. గతంలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. – దొర్నిపాడు

వాహనం సరే.. లైసెన్స్ మాటేంటి?

- లైసెన్సు పట్ల వాహనచోదకుల నిర్లక్ష్యం
- మొత్తం వాహనదారుల్లో సగం మందికే లైసెన్సు
- రెన్యూవల్‌కు దూరం
- ఏడాదిలో 4,419 వాహనాలపై కేసులు
- రూ.7.99 కోట్ల జరిమానా వసూలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): ఎలాంటి వాహనం నడపాలన్నా డ్రైవింగ్ తెలిసి ఉండాలి. లైసెన్సు తప్పనిసరి. కానీ ఈ విషయాన్ని వాహనదారులు ఖాతరు చేయడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి.. మెచ్చిన వాహనం కొనుగోలు చేస్తున్నారే కానీ.. లైసెన్సు తీసుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదానికి గురైతే బీమా వర్తించదు. ప్రాణాలు పోవడమో.. అంగవైకల్యానికి గురికాక తప్పదనే విషయాలు తెలిసినా వచ్చీ రాని డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్, డ్రైవింగ్ నిబంధనలు తెలియకుండా రయ్..రయ్ మంటూ దూసుకెళ్తూ ఎదుటి వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకు రవాణాశాఖతో పాటు పోలీస్ శాఖ సిబ్బంది నిత్యం జరిమానాలు విధిస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

చిక్కితే అంతే..

రవాణాశాఖ అధికారులు, పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. జిల్లాలో గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 694 ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలు, 25,140 నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రిజిష్టర్ కాగా, అందులో కేవలం 4,032 మందికి మాత్రమే లైసెన్స్‌లున్నాయి. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో లైసెన్స్‌లు లేని వారే అధికంగా ఉంటున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. వాహనదారుల్లో మార్పు కోసం ఎల్‌ఎల్‌ఆర్ మేళాలు, రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వంటి వాటికి కూడా జరిమానాలు విధిస్తున్నా స్పందన వాహనదారుల నుంచి కనిపించడం లేదు.

భారీగా పెనాల్టీలు..

లైసెన్స్‌లు లేని, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై రవాణాశాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. భారీగా జరిమానాలు విధిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎంవీఐలు పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేసి 4,128 వాహనాల నుంచి రూ.7,99,94,880 జరిమానా వసూలు చేశారు. రానున్న రోజుల్లో నిబంధనలు మరింత కఠినతరం చేసి ఉల్లంఘనులపై చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ జరిమానాల వివరాలు..

రిజిష్టర్ అయిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	- 694
రిజిష్టరైన నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు	- 25,140
లైసెన్స్‌లు పొందినవారు	- 4,032
కేసులు నమోదైన వాహనాల సంఖ్య	- 4,419
జరిమానా చెల్లించిన వాహనాల సంఖ్య	- 4,128
పెనాల్టీ ద్వారా వసూలైనా మొత్తం	- 7,99,94,880
పెనాల్టీ చెల్లించాల్సిన వాహనాల సంఖ్య	- 291

జరిమానాతో పాటు జైలుశిక్ష



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం ప్రమాదకరం, నేరం. పోలీసుల సహకారంతో రవాణా శాఖ పరిధిలో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం డీఎల్ ప్రక్రియను సులభతరం చేసింది. ఎల్‌ఎల్‌ఆర్ పరీక్షలో అతి సులువైన ట్రాఫిక్ సిగ్నల్‌కు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. డీఎల్ రెన్యూవల్ చేసుకోని చోదకులు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. గతంలో పట్టుకున్న వాహనాలకు నోటీసులు జారీ చేశాం. వారు వెంటనే అపరాధ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అవగాహన లేని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.


–జీవీ శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

అమ్మవారికి 108 వెండి పుష్పాల వితరణ



ప్రత్యేక అలంకారంలో వాసవీ మాత

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారికి భక్తులు 108 (3 కేజీల)వెండి పుష్పాలను వితరణగా సమర్పించారు. వాసవీ మాత జయంతి సందర్భంగా శనివారం ఆర్యవైశ్య సంఘం వారు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన నల్లగట్ల వెంకటేశులు, బోనగిరి కిట్టు తదితరులు కలిసి ఆర్థిక స్తోమతకు తగ్గట్టుగా వెండి పుష్పాలను చేయించి అమ్మవారికి సమర్పించారు. అన్నదాన ఖర్చుకు ఓ దాత రూ.10 వేల నగదు, గంగిశెట్టి తిమ్మయ్య ప్యాకెట్ బియ్యం అందజేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యుల సమక్షంలో వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు గావించారు.



వెండి పుష్పాలు

జీలుగ విత్తనాల మంజూరు

శిరివెళ్ల: మండలానికి ఈ ఖరీఫ్ సీజన్‌కు 650 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ సుధాకర్ శనివారం తెలిపారు. విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. 50 శాతం సబ్సిడీపై కేజీకీ రూ.44 చెలించి విత్తనాలను పొందవచ్చని చెప్పారు.

కనులపండువగా పద్మావతి, శ్రీనివాస కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ మర్చెంట్ కల్యాణ మండపంలో శనివారం వైశాక శుద్ధ దశమిని పురస్కరించుకొని పద్మావతి శ్రీనివాసుడి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు నిఖిలేష్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. పెళ్లి పెద్దలుగా ఆరవేటి రాజారత్నం, దంపతులు దుద్దేల సురేష్ బాబు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో నారాయణ, కొశెట్టి చంద్రశేఖర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌కుమార్, గురుచరణ్, కృష్ణమూర్తి, నవీన్‌కుమార్, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు